

## పది పరీక్షలే భవిష్యత్తుకు పునాది

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పదవ తరగతి పరీక్షలే ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తాయని న్యాయవాది పంద్రం శంకర్ అన్నారు. గురువారం నేరడిగొండ మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినిలకు ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి నుంచే ఉన్నత చదువులపై దృష్టి సారించి కెరీర్ గైడెన్స్ ద్వారా విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముందస్తు లక్ష్యాన్ని నిర్ణయించుకుని విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ ప్రణాళికను స్పష్టంగా రూపొందించుకుంటే విజయాన్ని సాధించవచ్చని అన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మన లక్ష్యాలను చేరుకోవడం సులభమవుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాయిగూడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్, జాతర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ రెడ్డి, బోథ్ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆత్రం శంకర్, తొడసం భూమన్నతో పాటు బోథ్, కుంటాల, మేడిగూడ, మడగూడ, లఖంపూర్ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కస్టమర్ల మన్ననలు పొందుతున్న
# శ్రీ కృష్ణ ఎలక్ట్రానిక్స్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణ కేంద్రంలోని పంజాబ్ చౌక్ వద్ద ఉన్న శ్రీ కృష్ణ ఎలక్ట్రానిక్స్ దుకాణం వినియోగదారుల మన్ననలు పొందుతోంది. ఎలక్ట్రానిక్స్, ప్లంబింగ్ సామగ్రిని అతి తక్కువ ధరలకు అందిస్తూ కస్టమర్ల విశ్వాసాన్ని సంపాదిస్తున్నట్లు షాపు యజమాని హరీష్ తెలిపారు. తమ దుకాణంలో గోల్డ్ మెడల్, విగార్డ్, హెవెల్స్ వంటి ప్రముఖ కంపెనీలకు చెందిన పైపులు, స్విచ్ బోర్డులు, వైర్లు, బల్బులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే ప్లంబింగ్‌కు సంబంధించిన ఆస్ట్రోల్, ప్లాస్టో తదితర కంపెనీల పైపులు, వాటర్ ట్యాంకులు, సింకులు, షీట్లు, నల్లాలు కూడా తక్కువ ధరలకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ వద్ద తక్కువ ధరలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్: 9701843021 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## నేడు 'ప్రజా పాలన ప్రణాళిక' ప్రారంభం

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో చేపట్టిన 'ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని శుక్రవారం నేరడిగొండ మండలంలో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మండల అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారి ఎండి సద్దాం విలేకరులకు తెలిపారు. కిళ్ళు, ఎముకల వ్యాధుల నిపుణులతో పాటు మహిళలకు సంబంధించిన వ్యాధుల వైద్యులు, పిల్లల వైద్యులు, నేత్ర వైద్యులు శిబిరంలో సేవలు అందించనున్నారని చెప్పారు. మండల వ్యాప్తంగా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే వారు తమ ఫోన్ నంబర్, ఆధార్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

## మహిళల భద్రత కోసం షీటీమ్

**ఉద్యమ కెరటం, తాండూర్:** మహిళల భద్రత కోసం షీటీమ్ బృందాలు పనిచేస్తున్నాయని మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ ఎస్సై ఉషారాణి అన్నారు. గురువారం మండలం రేచిని గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, షీటీమ్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా కలిగే అనర్థాలు, షీ టీమ్ ప్రాముఖ్యత, మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. అలాగే మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, జేజే చట్టం, మోటార్ వాహన చట్టం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, సైబర్ నేరాలు, సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, డయల్ 100 ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. మహిళలను వేధించినా, డ్రగ్స్ వినియోగించినా, రోడ్డుపై వెంబడించినా వెంటనే 100, రామగుండం షీటీం నం. 6303923700కు నిర్భయంగా సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీటీం కానిస్టేబుల్స్ శ్రవణ్, జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# పరీక్షల వేళ.. 'టెలీ మానస్'తో ఒత్తిడికి చెక్!




**వార్షిక పరీక్షలంటే విద్యార్థుల్లో ఒక రకమైన ఆందోళన. పుస్తకాల భారంతో పాటు, ఆశించిన మార్కులు వస్తాయా లేదా అన్న భయం వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తుంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తోంది ప్రభుత్వ 'టెలీ మానస్' సేవలు.**

### భయం వద్దు.. భరోసా ఉంది..!



ప్రస్తుతం ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల సమయం కావడంతో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది. కేవలం చదువు మాత్రమే కాదు, నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, తెలియని ఆందోళన వంటి సమస్యలు వారిని వేధిస్తుంటాయి. ఇలాంటి సమయంలో విద్యార్థులు తమ మనసులోని భయాన్ని పంచుకోవడానికి, నిపుణుల సలహాలు పొందడానికి 'టెలీ మానస్' ఒక అద్భుతమైన వేదికగా మారింది. ఒక్క కాల్‌తో నిపుణుల సలహా విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఎవరైనా సరే, మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు 14416 లేదా 1-800-891-4416 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు. ఇది కేవలం ఒక కాల్ సెంటర్ మాత్రమే కాదు; ఇక్కడ నిరంతరం అందుబాటులో ఉండే క్లినికల్ సైకాలజిస్టులు, మానసిక వైద్య నిపుణులు , ప్రత్యేక శిక్షణ పొందిన నర్సులు విద్యార్థుల సమస్యలను ఓపికగా విని, వారికి తగిన పరిష్కార మార్గాలను సూచిస్తారు.

- ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్

## రక్షణ కవచంలా 'టెలీ మానస్'

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. సీతారాం**



టెలీ మానస్ సేవలు ఆపదలో ఉన్న వారికి ఒక 'రక్షణ కవచం' లాంటివి. ఫోన్ ద్వారానే కాకుండా, అవసరమైన వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక విభాగంలో నిపుణులను నేరుగా కలవవచ్చు. పరీక్షలను ఒక సవాల్‌గా కాకుండా, ఒక ప్రక్రియగా చూడండి. ఒత్తిడి అనిపించినప్పుడు వెంటనే తల్లిదండ్రులతో లేదా టెలీ మానస్ నిపుణులతో మాట్లాడండి. సరిపడా నిద్ర, సరైన ఆహారం తీసుకోవడం మర్చిపోవద్దు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత సేవలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి. మానసిక దృఢత్వంతో పరీక్షలను ఎదుర్కొన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురాకుండా, వారికి ఈ హెల్ప్ లైన్ నెంబర్ల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'ను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఈ కార్యక్రమ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణను వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా ఈ 99 రోజుల కార్యక్రమం 10 ప్రధాన అంశాలపై కొనసాగుతుందని, మార్చి 6 నుండి 15 వరకు అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించాలని ఆదేశించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కోరారు. ప్రజాప్రతినిధులైన సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యం, రహదారి భద్రతలో భాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం, సంక్షేమం, శిశు సంరక్షణ, డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, క్రీడలు ,పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ఈ ప్రణాళికను జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డెవిడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్‌లో 99 రోజుల స్పెషల్ డ్రైవ్

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం 99 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచ్ మామిడాల లలిత రాజేశం ఆధ్వర్యంలో వార్డు సభ్యులు గ్రామంలోని అన్ని వార్డుల్లో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో మంత్రి జూపల్లి పర్యటన



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ని ర్వహించే స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని మంత్రి ప్రా రంభించనున్నారు. 11 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు తీరుపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 1.55 గంటలకు ఆదిలాబాద్ మహాలక్ష్మివాడలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్మించిన అదనపు డార్మిటరీ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బేల మండలం డోప్టాల గ్రామంలో నిర్వహించే గృహప్రవేశ కార్యక్రమానికి హాజరవుతారు.

## ప్రజాపాలన ప్రణాళికకు అందరి సహకారం అవసరం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మండల, జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును మెరుగుపర్చడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ప్రజాపాలన దరఖాస్తుల క్రోడీకరణ, అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, మండల, జిల్లా స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకత పాటించాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, జెడ్పీ సీఈఓ రవీందర్, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎఫ్ఆర్ఓ గణేష్ అన్నారు. జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఇచ్చోడ అటవీ డివిజన్ అధికారి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'చిత్తడి నేలల సంరక్షణ', 'జీవ వైవిధ్యం' అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రకృతి సంపదను కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత అని, చెట్లు, అటవీ వనరులను సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ నర్సా గౌడ్ అన్నారు. గురువారం గంభీరావుపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేదలు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆసుపత్రిలో విద్యుత్ దీపాల కొరత ఉన్నట్లు సర్పంచ్‌కు తెలియజేయగా, అవసరమైన ఏర్పాట్లు త్వరగా చేయిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. అలాగే కొత్త పీహెచ్‌సీ భవన నిర్మాణం ప్రారంభం కోసం సంబంధిత అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడుతున్నామని తెలిపారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సృజన్, మాజీ జెడ్పీటీసీ మల్లుగారి నర్సా గౌడ్, ఎంఐఎం మండల అధ్యక్షుడు ఇర్ఫాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## భవనాల నిర్మాణ పనులు చేపట్టాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలో గ్రామపంచాయతీ, వీఓ నూతన భవనాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ చందనాల రవి కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ, వీఓ భవనాల నిర్మాణం కోసం గత ఆగస్టు నెలలో అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేసినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ కారణంగా అధికారులు పనులు ప్రారంభించడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామపంచాయతీ, వీఓ భవనాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ చింతపురి మల్లీశ్వరి, వార్డు సభ్యులు చందనాల లత, గొర్లపల్లి కమలాకర్, వాసల అనిల్ కుమార్, వాసల సాయి కుమార్, కుర్సెంగ తిరుపతి, గ్రామ కార్యదర్శి తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలను సంరక్షించుకుంటే దిగుబడి



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పంటలను సంరక్షించుకుంటే రైతులు మంచి దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సలావుద్దీన్ అన్నారు. గురువారం గంభీరావుపేట మండలంలో పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంటల్లో కనిపిస్తున్న అగ్గి తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలను ఎలా సంరక్షించుకోవాలో సూచనలు చేశారు. పంటల దిగుబడి మెరుగుపడేందుకు యూరియా ఎరువును చల్లే సరైన విధానం గురించి వివరించారు. ఎరువులను సమయానికి, సరైన మోతాదులో వినియోగిస్తే పంటలకు మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గంట శ్రీనివాస్, ముకుంద పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద 46 మంది లబ్ధిదారులకు గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అమ్మాయిల వివాహాల సమయంలో ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన వారు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సామాజిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక పథకాలను అమలు చేస్తోందని, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు మల్లుగారి పద్మ, లతిక, ఎల్లయ్య, అర్చన, ప్రశాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో అభివృద్ధిలో భాగంగా చేపట్టిన వివిధ నిర్మాణ పనులను వేగవంతం చేసి, గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన చెన్నూర్ మరియు కోటపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి, పలు ప్రభుత్వ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతోందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ మండలంలో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను పరిశీలించి, పనులు త్వరగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సోమనపల్లి గ్రామంలో ప్రభుత్వం రూ. 200 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల స్థలాన్ని తహశీల్దార్ మల్లికార్జున్ తో కలిసి సందర్శించి, నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించిన కలెక్టర్, గుత్తేదారుల సమన్వయంతో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీబీవీలను సందర్శించిన సమయంలో అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణాలను పరిశీలించడంతో పాటు, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మరియు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించడం విశేషం. కోటపల్లి మండల పర్యటనలో భాగంగా గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అదనపు తరగతి గదులు, వంటశాల నిర్మాణాలను తహశీల్దార్ రాఘవేంద్ర, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని, పారిశుధ్య నిర్వహణ మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచ్ లు, వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీఓను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

# పారిశుధ్య నిర్వహణ ప్రతిఒక్కరి బాధ్యత






**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం అందరి కర్తవ్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలోని 32వ డివిజన్‌లో "మంచిర్యాల శుభ్రత ఉ ప్రతిఒక్కరి ఆరోగ్య భద్రత" కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ చల్లా రమ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయని తెలిపారు. వచ్చే 99 రోజుల్లో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న జనన, మరణ, భవన నిర్మాణ అనుమతులు, ఇతర ధ్రువపత్రాలకు సంబంధించిన ఫైళ్లను త్వరగా క్లియర్ చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ, శుభ్రత కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్, విద్యుత్, తాగునీటి శాఖల సమన్వయంతో సమస్యలను గుర్తించి పరిష్కరించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ముందుగా ఆయా డివిజన్లలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ఫంక్షన్ హాళ్లు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు, మద్యం దుకాణాల నిర్వాహకులు శుభ్రత విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నస్పూర్ మండలం తీగల్ పహాడ్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత నస్పూర్ మండల కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు దేశ్ పాండే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి త్రైమాసిక పరిశీలనలో భాగంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ప్రమాదకరంగా కాలువ

### చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి







**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండలంలోని లింగన్నపేట నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువ ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. రహదారి పక్కనే లోతుగా ప్రవహిస్తున్న ఈ కాలువకు ఎలాంటి రక్షణ గోడలు, ఇనుప రైలింగులు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రహదారి డాంబార్ పూర్తిగా పాడైపోవడంతో ప్రమాదం ముప్పు మరింత పెరిగింది. ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి చాలా సన్నగా ఉండటంతో పాటు ఒక వైపు లోతైన కాలువ ఉండటంతో చిన్నపాటి నిర్లక్ష్యంతోనే వాహనాలు కాలువలో పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో సరైన వెలుతురు లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యలను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరిగే ముందు వెంటనే స్పందించి రహదారి పక్కన రక్షణ గోడలు నిర్మించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి భద్రతా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే గ్రామానికి వెళ్లే ఈ మార్గాన్ని తక్షణమే డాంబార్ రోడ్డు వేసి, కాలువ ప్రక్కన రక్షణ గోడలు నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని స్థానిక ప్రజలు, రైతులు, వాహనదారులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

